సాక్షి అన్నమయ్య జిల్లా

సోమవారం । 20 । జనవరి । 2025



గ్రా'నైట్' తరలుతోంది.!

గుర్రంకొండ మీదుగా యథేచ్ఛగా గ్రానైట్ అక్రమ రవాణా సాగుతోంది. అధికారపార్టీ నాయకులు, అధికారుల అండతో గ్రానైట్ మాఫియా చెలరేగిపోతోంది. -8లో



ఎవరేమనుకున్నా..తగ్గేదేలే

సంక్రాంతి పండగను పురస్కరించుకుని జిల్లాలోని కురబలకోట మండలంలో గోదావరి జిల్లాలను తలపింపజేసేలా కోడి పందేలను జోరుగా నిర్వహించారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.130	రూ.160
రెండోరకం	రూ.90	రూ.120

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 119 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

రాయచోటి: ప్రజల నుంచి సమస్యలను స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు ఈనెల 20వ తేదిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ ఆదివాం ఒక ప్రకటనలో కలెక్టర్ పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటితోపాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. మండల, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో జరిగే కార్యక్రమానికి రావాలని తెలిపారు.

అర్జీలను త్వరగా పరిష్కరించాలి

చిన్నమండెం: ప్రజాదర్బార్ కార్యక్రమంలో వచ్చిన అర్జీలను అధికారులు నిర్లక్ష్యం చేయకుండా త్వరగా పరిష్కరించాలని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడ శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం చిన్నమండెం మండలం బోరెడ్డిగారిపల్లెలోని తమ నివాసంలో మంత్రి ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా పలువురు ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో మంత్రికి అందజేశారు.

ఎస్సీ వర్గీకరణ ఏకసభ్య కమిటీ మదనపల్లెకు రాక

మదనపల్లె: షెడ్యూల్‌కులాల వర్గీకరణకు సంబంధించి ప్రభుత్వం ఏర్పాటుచేసిన ఏకసభ్యకమిటీ సోమవారం సాయంత్రం మదనపల్లెకు రానున్నదని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఒక ప్రకటనలో తెలిపారు. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి రాజీవ్ రంజన్ మిశ్రాతో కూడిన ఏకసభ్య కమిటీ సభ్యులు సోమవారం ఉదయం అనంతపురంలో కార్యక్రమాలు ముగించుకుని సాయంత్రం 6 గంటలకు మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయానికి చేరుకుంటారన్నారు. అయితే...షెడ్యూల్ కులాల వర్గీకరణపై వినతులను 21వతేదీ మంగళవారం ఉదయం చిత్తూరులోని నాగయ్య కళాక్షేత్రంలో జరగనున్న సమావేశంలో స్వీకరిస్తారని తెలిపారు. ఎవరైనా వర్గీకరణకు సంబంధించి వినతులు సమర్పించాలనుకుంటే, మంగళవారం చిత్తూరులో జరిగే సమావేశంలో సమర్పించాలన్నారు.

నేటినుంచి కుష్టువ్యాధిపై ఇంటింటి సర్వే



డీఎంహెచ్‌ఓ కొండయ్య

రాయచోటి అర్బన్: జనవరి 20 నుంచి ఫ్రిబవరి 2వ తేదీ వరకు ఇంటింటికి కుష్టువ్యాధి సర్వే జరుగుతుందని డీఎంహెచ్‌ఓ కొండయ్య తెలిపారు. అంగవైకల్యాన్ని నివారించేందుకు ముందుగానే కుష్టువ్యాధి గుర్తింపు కార్యక్రమాన్ని 15రోజుల పాటు చేపడుతున్నట్లు చెప్పారు. క్షేత్రస్థాయిలో సర్వే చేయనున్న ఆశా కార్యకర్తలు, పురుష వలంటీర్లకు ఆయా పీహెచ్‌సీల్లో శిక్షణ ఇచ్చామన్నారు. ఈ వ్యాధి ఒక సూక్ష్మక్రిమి వల్ల వస్తుందన్నారు. స్పర్శలేని మచ్చలు, మచ్చలు మిలమిల మెరుస్తూ ఉంటాయని, ఎలాంటి నొప్పి ఉండదన్నారు. కుష్టువ్యాధి బారిన పడినవారు ఒక సంవత్సరం పాటు క్రమం తప్ప కుండా మందులు వాడాలన్నారు. శరీరంపై స్పర్శలేని రాగిరంగు మచ్చలు ఉన్నవారు సర్వేకు వచ్చే ఆశాకార్యకర్తల వద్ద పరీక్షలు చేయించుకుని వ్యాధి నిర్దారణ చేయించుకోవాలని అన్నారు.



ఆశలపై నీళ్లు!

ఈసారి నష్టమే



ఇతని పేరు డి.నారాయణరెడ్డి. పుల్లంపేట మండలం అనంతంపల్లె గ్రామం. ఈయనకు ఏడు ఎకరాల పొలం ఉంది. అందులో మూడు ఎకరాల్లో మామిడి తోటలు సాగులో ఉన్నాయి. సుమారు 12 సంవత్సరాల వయస్సుగల చెట్లు ఉన్నాయి. కానీ ఇప్పటికీ పూత రాలేదు. ప్రతి ఏడాది ఈ పాటికే పూత, పిందె వచ్చేది. గతంలో ప్రతిసారి రూ. 2–3 లక్షలు మామిడి పంటపై ఆదాయం వచ్చేది. ఇప్పటివరకు పూత కనిపించకపోవడంతో ఈసారి పంటపై నష్టం తప్ప లాభం లేదని రైతు పేర్కొంటున్నాడు.

వాతావరణ ప్రభావంతో....




ఇతని పేరు బొజ్జ సోమశేఖర్ రెడ్డి. లక్కిరెడ్డిపల్లె మండలం ఊరురెడ్డివారిపల్లె గ్రామం. ఈయనకు 15 ఎకరాలు మామిడి తోట ఉంది. వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతోపాటు పొగ మంచుతో చీడపీడలు అధికమయ్యాయి. దీంతో మందులు స్ప్రే చేయాలంటే రూ.60 నుంచి 70 వేలు ఖర్చు అవుతుంది. జనవరి చివరి కావస్తున్న ఇప్పటికీ మామిడి తోటల్లో పూత, మొగ్గ దశ కూడా కనిపించడం లేదు. నష్టాలు చవిచూడాల్సి వస్తోంది. ప్రభుత్వం ఆదుకోవాలని అంటున్నాడు.



లక్కిరెడ్డిపల్లి మండలం మద్దిరేవులలో పూత, పిందె లేని మామిడి తోట

- వాతావరణ మార్పులతో మామిడికి కోలుకోలేని దెబ్బ
- చలి, మంచుతోపాటు తుపాను వర్షాలతో కనిపించని పూత
- పూత, పిందెతో కళకళలాడాల్సిన చెట్లు బోసిపోయిన వైనం
- అయోమయంలో రైతులు



సాక్షి రాయచోటి: కలిసిరాని కాలంలో రైతుకు కష్టకాలం తప్పలేదు. ఒకవైపు ఖరీఫ్ తుడిచి పెట్టుకుపోగా..రబీలోనూ అంతంత మాత్రంగానే పంటలు సాగైన పరిస్థితి కళ్లెదుటే కనిపిస్తుండగా...పండ్ల తోటలను కూడా ప్రకృతి వదల్లేదు. వాతావరణ పరిస్థితుల ప్రభావమో లేక చలి, మంచు, తుపాన్ల కారణమో తెలియదుగానీ మామిడి రైతు మాత్రం నిలువునా నలిగిపోయాడు. ఈ పాటికే పూత, పిందెలతో కళకళలాడాల్సిన మామిడి తోటలు కళ తప్పాయి. ఎక్కడో ఒకటి, అర కనిపిస్తున్నా జిల్లాలో అన్నిచోట్ల మామిడి పంటను మాత్రం వాతావరణం తీవ్రంగా దెబ్బతీసింది. అయితే ఇప్పుడు కూడా పూత వచ్చే అవకాశం ఉందని ఉద్యానశాఖ అధికారులు అంటున్నా ఇప్పటికిప్పుడు రావడం కష్టమేనని రైతులు అంటున్నారు.

తుపాన్ల ప్రభావంతోనే దెబ్బ

అన్నమయ్య జిల్లాలో మామిడి పంట సుమారు 37 వేల హెక్టార్లలో సాగైంది. ఇందులో 10–15 వేల హెక్టార్లు చిన్న చెట్లు ఉండగా, పదేళ్లు పైబడిన తోటలు దాదాపు 20 వేల హెకార్టకు పైగా ఉన్నాయి. అయితే ప్రధానంగా సేద్యం చేసి వదిలేసిన తర్వాత తోటలు ఆరగానే..అక్టోబరు, నవంబరు, డిసెంబర్ నెలల్లో పూత, పిందె కనిపించేది. అయితే ఈసారి మూడు నెలల్లో వరుసబెట్టి తుపాన్లు రావడం వల్ల పూత, పిందె లేకుండా చెట్లు కనిపిస్తున్నాయి. ఈసారి చలి ప్రభావం కూడా తీవ్ర స్థాయిలో ఉండడంతో మంచు కూడా మామిడి రైతును కుదేలు చేస్తోంది. సాధారణంగా తెగుళ్లు, ఇతర ప్రభావంతో అప్పుడప్పుడు మామిడి పంటపై ప్రభావం కనిపించేది. సుమారు ఎకరాకు రూ. 40–50 వేలు పెట్టి పూత, పిందె కోసం పురుగు మందులు పిచికారీ చేసి భారీగా ఖర్చు పెట్టినా ఫలితం కానరాకపోవడంతో రైతన్నలు గగ్గోలు పెడుతున్నారు. జిల్లాలో రైల్వేకోడూరు, రాజంపేట, రాయచోటి, పీలేరు నియోజకవర్గాల్లో అధికంగా మామిడి పంట సాగు చేస్తారు. సుమారు 20 రకాల మామిడి పంట సాగులో ఉంది. ప్రతి ఏడాది సుమారు 200 టన్నులకు పైగా ఇక్కడి నుంచి వివిధ రాష్ట్రాలకు మామిడి దిగుబడి వెళుతుందంటే అతిశయోక్తి కాదు. కానీ ఈసారి ప్రకృతి చేసిన గాయానికి కాయలు ఎంత మాత్రం ఉంటాయన్నది కూడా చెప్పలేని పరిస్థితి నెలకొంది. ఇప్పటివరకు చిన్నమండెం, మిగతా ఒకటి, రెండు ఊర్లలో మాత్రమే కొంతమేర పూత ఉన్న చెట్లు కనిపిస్తుండగా ఇక జిల్లాలో ఎక్కడా మామిడికి పూత లేదు. ఈసారి మామిడి రైతుల ఆశలపై ప్రకృతి నీళ్లు చల్లడంతో అన్నదాతల్లో ఆందోళన నెలకొంటోంది.

రెండుసార్లు మందులు పిచికారి చేశా



నాకు ఐదు ఎకరాలు ముదురు మామిడి తోట ఉంది. ఇప్పటికే రెండు సార్లు మందులు పిచికారీ చేశా. ఇప్పటికీ తోటలో మామిడి పూత కనిపించలేదు. సేద్యం, పురుగుమందులు, ఎరువుల కోసం ఇప్పటికే రెండు లక్షలు ఖర్చు చేశా. కానీ తోటలో పూత కనిపించకపోవడంతో పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదు. -రామసుబ్బయ్య, లక్కిరెడ్డిపల్లె మండలం

ఇప్పుడు కూడా పూత వచ్చే అవకాశం



జిల్లాలోని చాలాచోట్ల మామిడిలో పూత, పిందె కనిపించలేదు. చిన్నమండెంతోపాటు కొన్ని మండలాల్లో కొంతమేర వచ్చింది. అక్టోబరు, నవంబరు మాసాల్లో వచ్చిన తుపాన్ల వల్ల పూత కనిపించలేదు. ఇప్పుడు కూడా వచ్చే అవకాశం ఉంది. గతంలో కూడా పూత ఆలస్యంగా వచ్చిన సందర్భాలున్నాయి.
– రవిచంద్రబాబు, జిల్లా ఉద్యానశాఖ అధికారి

అక్రమ వసూళ్లకు పాల్పడితే చర్యలు

రాయచోటి: గ్యాస్ ఏజెన్సీలో డెలివరీ సిబ్బంది అదనపు వసూళ్లకు పాల్పడితే చర్యలు తప్పవని జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ హెచ్చరించారు. ఈమేరకు ఆదివారం ప్రకటన విడుదల చేశారు. గ్యాస్ సిలిండర్ల సరఫరాలో కొంతమంది అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. గ్యాస్ ఏజెన్సీల వారితో సమావేశం నిర్వహిస్తామని, వచ్చిన ఫిర్యాదులు రుజువైతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఎవరైనా అదనంగా వసూలు చేస్తే సంబంధిత సేల్స్ ఆఫీసర్లకు, తహసీల్దార్లు, సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్లకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

గంగమ్మా..కరుణించవమ్మా



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

లక్కిరెడ్డిపల్లి: మండల పరిధిలోని అనంతపురం గ్రామంలో వెలసిన అనంతపురం గంగమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు చెల్లు వంశీయులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు క్యూలైన్‌లో వెళ్లి అమ్మవారిని దర్శించుకున్నారు..గంగమ్మా..కరుణించవమ్మా అని వేడుకున్నారు. మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాసులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

సంఘ సంస్కర్త యోగి వేమన



రెడ్డిసంక్షేమసంఘం ఆధ్వర్యంలో యోగివేమన చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సభ్యులు

మదనపల్లె : సమాజంలో ఎన్నో రుగ్మతలకు తన పద్యాలతో చీల్చి చెండాడిన సంఘసంస్కర్త, మహోన్నత ప్రజాకవి యోగివేమన అని రెడ్డి సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు కనుగొండ మద్దిరెడ్డి అన్నారు. ఆదివారం రెడ్డిసంక్షేమ సంఘం, మదనపల్లె ప్రధానకార్యదర్శి డాక్టర్.అనిల్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోని బెంగళూరురోడ్డు రెడ్డిభవన్‌లో యోగివేమన జయంత్యుత్సవాలను నిర్వహించారు. వేమన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా కనుగొండ మద్దిరెడ్డి మాట్లాడుతూ..సమాజంలోని మంచి చెడుల మధ్య వ్యత్యాసాన్ని అనుభవించి, అన్వయించి, అనర్గళంగా అతి సరళమైన భాషలో సామాన్యుడికి సైతం అర్థమయ్యే రీతిలో నీతివాక్య భాండాగారాన్ని సృష్టించిన మహనీయుడు యోగివేమన అని అన్నారు. తెలుగుసాహితీ రంగానికి తరగని సంపద వేమన పద్యాలు అన్నారు. రెడ్డిసంక్షేమ సంఘం మాజీ అధ్యక్షులు టి.రామచంద్రారెడ్డి, ఉపా ధ్యక్షులు వై.సాంబశివారెడ్డి, జాయింట్ సెక్రటరీ కే.సుధాకర్‌రెడ్డి, గిరిధర్‌రెడ్డి, అడ్వకేట్ శేషారెడ్డి, కమిటీసభ్యులు తట్టిశ్రీనివాసులురెడ్డి, కరుణాకర్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, మస్తాన్‌రెడ్డి, సుబ్బారెడ్డి, దేవేందర్‌రెడ్డి, చంద్రారెడ్డి, జయనారాయణరెడ్డి, జయచంద్రారెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, రంగారెడ్డి, రామలింగారెడ్డి, సురేందర్‌రెడ్డి, మాధవరెడ్డి, ఎస్.సాంబశివారెడ్డి పాల్గొన్నారు.

బస్సుల కోసం పడిగాపులు

- రాయచోటిలో ప్రయాణికుల కష్టాలు
- పాఠశాలలు తెరుస్తుండడంతో వెళ్లేందుకు బస్టాండులో నిరీక్షణ



రాయచోటి బస్టాండులో బస్సులో సీటు కోసం ప్రయాణికుల పాట్లు



రాయచోటి బస్టాండులో బస్సులకోసం వేచి ఉన్న ప్రయాణికులు

సాక్షి రాయచోటి: సంక్రాంతి పండుగకు చాలా రోజులు సెలవులు రావడంతో దూర ప్రాంతాల నుంచి సొంతూర్లకు వచ్చిన స్థానికులకు వెళ్లేందుకు కష్టాలు తప్పడం లేదు. దాంతోపాటు వివిధ ప్రాంతాల్లో చదువుతున్న విద్యార్థులు పండుగకు వచ్చి తిరుగుప్రయాణంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎప్పుడూ లేని తరహాలో ఆదివారం జిల్లాలోని రాయచోటి బస్టాండులో పరిస్థితి చూస్తే.. ఔరా అనిపించక మానదు. జనాలంతా బస్టాండులో వేచి ఉన్నా బస్సులు రాకపోవడంతో ఆందోళన చెందుతున్న పరిస్థితులు కనిపించాయి. అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటిలోని బస్టాండులో ఎప్పుడూ లేని తరహాలో భారీ ఎత్తున ప్రయాణికులు బస్సుల కోసం వేచి ఉన్నారు.

పాఠశాలలకు సంక్రాంతి సెలవుల అనంతరం సోమవారం నుంచి పునః ప్రారంభం కానున్న నేపథ్యంలో ఇటు తిరుపతి, అటు కడప, పీలేరు, చెన్నై, హైదరాబాద్, బెంగళూరులకు వెళ్లే విద్యార్థులు అధిక సంఖ్యలో వేచి ఉన్నారు. దీంతో రాయచోటి బస్టాండు ఎటువైపు చూసినా జనమే కనిపించారు. రోజువారి సర్వీసులు కూడా తక్కువగా ఉండడంతో వివిధ పాంతాలకు వెళ్లేవారు కూడా ఇబ్బందులు పడ్డారు. జిల్లా కేంద్రమైన రాయచోటితోపాటు మదనపల్లె బస్టాండు కూడా ఆదివారం ప్రయాణీకులతో కిటకిటలాడింది ఏది ఏమైనా కిక్కిరిసిన ప్రయాణీకుల మధ్య బస్టాండ్లలో పండుగ కష్టం కళ్లకు కట్టినట్లు కనిపించింది.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు



ట్రోఫీ అందుకుంటున్న వైఎస్సార్ జిల్లా బాలుర హాకీ జట్టు

సబ్ జూనియర్ బాలుర హాకీ రాష్ట్ర విజేత వైఎస్సార్ జిల్లా జట్టు

మదనపల్లె సిటీ: క్రీడల్లో రాణిస్తే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఏపీ హాకీ అధ్యక్షులు బీఎం.చాణుక్యరాజ్ అన్నారు. ఆదివారం అన్నమయ్య మదనపల్లె బీటీ కాలేజీ బిసెంట్ హాలులో 14వ ఏపీ సబ్ జూనియర్ బాలుర హాకీ రాష్ట్ర స్థాయి పోటీలు ముగింపు కార్యక్రమం జరిగింది.విజేతలకు ట్రోఫీలు, మెడల్స్ ప్రదానోత్సవం జరిగింది. ఆయన మాట్లాడుతూ పోటీల్లో పాల్గొనడం ముఖ్యమని గెలుపు,ఓటములు సమానంగా తీసుకోవాలన్నారు. ఈ పోటీలకు రాష్ట్రం వ్యాప్తంగా 22 జిల్లాల నుంచి జట్లు పోటీల్లో పాల్గొన్నాయన్నారు. టౌన్‌బ్యాంకు చైర్మన్ నాదెళ్ల విద్యాసాగర్ మాట్లాడుతూ ప్రస్తుతం క్రీడపట్ల ఆసక్తి తగ్గిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సెల్‌ఫోన్లు చూసుకోవడం తప్ప క్రీడలపై మొగ్గుచూపడం లేదన్నారు. క్రీడల్లో పాల్గొనడం వల్ల ఆరోగ్యానికి ఎంతో మంచిదన్నారు. కార్యక్రమంలో ఏపీ హాకీ కోశాధికారి పి.థామస్, టోర్నమెంట్ డైరెక్టర్ రాజశేఖర్, ది అన్నమయ్య హాకీ జిల్లా అధ్యక్షులు పి.వి.ప్రసాద్, ప్రధాన కార్యదర్శి శివప్రసాద్, కోశాధికారి పి.ప్రసాద్‌రెడ్డి, కన్వీనర్ హితేష్‌రావు, కోచ్ నౌషాద్, పీడీ జలజ తదితరులు పాల్గొన్నారు. బీటీ కాలేజీ రిటైర్డు పీడీ బి.సుబ్రమణ్యంను సీనియర్ హాకీ క్రీడాకారులు హాకీ అకాడమీ సభ్యులు ఘనంగా సన్మానించారు.

రాష్ట్ర స్థాయి విజేత వైఎస్సార్ జిల్లా జట్టు: 14వ ఏపీ సబ్ జూనియర్ బాలుర రాష్ట్ర స్థాయి హాకీ ఛాంపియన్ షిప్ ఫైనల్లో వైఎస్సార్ జిల్లా జట్టు- అనకాపల్లి జిల్లా జట్టుపై 2–1 స్కోరుతో విజయం సాధించి ట్రోఫీ కైవసం చేసుకుంది.రన్నర్స్‌గా అనకాపల్లి జిల్లా, తృతీయ స్థానం తిరుపతి జిల్లా జట్టు నిలిచింది. నాల్గవ స్థానంలో అన్నమయ్య జిల్లా నిలిచింది.

పేదింటి కిరణాలు.. క్రీడా కెరటాలు

వీరంతా పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు. సర్కారుబడుల్లో చదువుతున్నారు. వ్యాయామ ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో మదనపల్లెలో జరిగిన ఏపీ సబ్ జూనియర్ హాకీ రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచారు. ఫైనల్లో విజేతలుగా నిలిచారు. తమ సత్తాను చాటి ఛాంపియన్ ట్రోఫీ అందుకున్నారు. ఈ నేపథ్యంలో హాకీ క్రీడలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారుల గురించి కథనం. –మదనపల్లె సిటీ

- చిన్నారులు..హాకీలో చిరుతలు
- రాష్ట్ర స్థాయి హాకీ పోటీల్లో ప్రతిభ



తలపడుతున్న వైఎస్సార్ జిల్లా, అనకాపల్లి జిల్లా జట్లు

పూర్వ వైభవం తెస్తా...



నా పేరు కె.సంతోష్‌కుమార్. తల్లిదండ్రులు రాంప్రసాద్, మాధవి, వైఎస్సార్ స్పోర్ట్సు పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నా. నాన్న ఆటో డ్రైవర్. గత రెండు సంవత్సరాలుగా హాకీలో రాణిస్తున్నా. ఛండీగడ్, కేరళ, హర్యానా రాష్ట్రాల్లో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపాను. హాకీకి పూర్వ వైభవం తెస్తా.

ప్రతిభ చాటి..లక్ష్యాన్ని చేరుకుని..



నా పేరు నాగభవానీ శంకర్. డాక్టర్ వైఎస్సార్ స్పోర్ట్స్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నా. నాన్న సాయిప్రతాప్, అమ్మ నాగమల్లేశ్వరి. నాన్న అంబులెన్స్ డ్రైవర్‌గా పని చేస్తున్నారు. చిన్నప్పటి నుంచి క్రీడలంటే ఇష్టం. ఇందుకు అమ్మానాన్నలు ప్రోత్సహించారు. మూడు సంవత్సరాల నుంచి హాకీ ఆడుతున్నా. గోల్ కీపర్‌గా కీలకంగా వ్యవహరిస్తున్నా. ఇప్పటి వరకు జాతీయ స్థాయిలో ఛండీగడ్, కేరళ, మధ్యప్రదేశ్, పూణేలలో జరిగిన హాకీ ఛాంపియన్ పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచా. అనుకున్న లక్ష్యాన్ని సాధించాలన్నదే తన ధ్యేయం.

ఆట తీరులో మెప్పించి .. చోటు సాధించి...



నా పేరు గంగా చైతన్య. వైఎస్సార్ జిల్లా పులివెందుల జెడ్పీ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నా. తల్లిదండ్రులు రమాదేవి, గంగాధర్. తండ్రి లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నారు. రెండు సంవత్సరాలుగా హాకీ ఆడుతున్నా. ఖేల్ ఇండియాలో శిక్షణ తీసుకున్నా. ఆటలో తన ప్రతిభను గుర్తించి పీడీ రవికుమార్ ప్రోత్సహించారు. ఛండీగడ్, కేరళ, హర్యానా రాష్ట్రాల్లో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్నా. హాకీలో మంచి గుర్తింపు తీసుకువస్తా.

తల్లిదండ్రుల ప్రోత్సాహంతో...



నా పేరు పి.బాలాజీ. వైఎస్సార్ స్పోర్ట్స్ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నా. తల్లిదండ్రులు నాగకవిత, రామమోహన్. తండ్రి చిరు వ్యాపారి. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో చిన్నతనం నుంచి క్రీడలపై ఆసక్తి పెరిగింది. స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశం లభించింది. ఇక్కడ హాకీలో ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఛండీగడ్, పుణే, కేరళ రాష్ట్రాల్లో జరిగిన జాతీయ స్థాయిలో పాల్గొన్నా. హాకీలో మంచి క్రీడాకారుడిగా పేరు తెస్తా.

కోచ్‌ల సహకారంతో..



నా పేరు ఎస్.జాకీర్‌హుస్సేన్. వైఎస్సార్ స్పోర్ట్స్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నా. తల్లిదండ్రులు సబీరాబీ, వలిబాషా. తండ్రి కండక్టర్‌గా పని చేస్తున్నారు. క్రీడల్లో రాణించి స్పోర్ట్స్ స్కూల్‌లో చేరా. పాఠశాలలో కోచ్‌ల సహకారంతో గత మూడు సంవత్సరాల నుంచి హాకీలో రాణిస్తున్నా. పూణే, మధ్యప్రదేశ్, కేరళ, ఛండీగడ్ రాష్ట్రాలో జరిగిన జాతీయ స్థాయి పోటీతల్లో పాల్గొన్నా.ఇండియాకు ఉన్న హాకీ పేరు నిలబెడుతా.

హాకీ క్రీడపై ఇష్టంతో...



నా పేరు ఎం.బాలాజీ. తల్లిదండ్రులు ఎం.వెంకటసుబ్బయ్య, నరసమ్మ. వైఎస్సార్ స్పోర్ట్స్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నా. తండ్రి మేస్త్రీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. హాకీ క్రీడ అంటే ఎంతో ఇష్టం. కోచ్‌ల సహకారంతో గత రెండు సంవత్సరాలుగా హాకీ పోటీల్లో పాల్గొంటున్నా. పూణే, హర్యానా రాష్ట్రాల్లో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్నా. హాకీ క్రీడకు గుర్తింపు తెస్తా.

క్లుప్తంగా

శతాధిక వృద్ధురాలి మృతి


వీరనాగమ్మ (ఫైల్)

పీలేరు : మండలంలోని యల్లమంద పంచాయతీ నగిరికి చెందిన వీరనాగమ్మ నాయకురాలు (115) అనే శతాధిక వృద్ధురాలు శనివారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వీరనాగమ్మకు కుమారులు, కుమార్తెలు, మనవళ్లు, మనమరాళ్లు, ముని మనవళ్లు, మునిమనవరాళ్లతోపాటు వివాహాలైన వారి పిల్లలు కూడా ఉన్నారు. వారం రోజుల క్రితం వరకు కూడా ఎవరిపై ఆధారపడకుండా తన పనులు తానే చేసుకుంటూ ఆరోగ్యంగా ఉండేది. వారం రోజుల క్రితం ప్రమాదవశాత్తు కిందపడి గాయపడి శనివారం మృతి చెందింది.

ప్రైవేటు బస్సు ఢీకొని ఒకరి మృతి


మృతి చెందిన నారాయణస్వామి

రామసముద్రం : రామసముద్రం మండలం ఎలకపల్లి పంచాయతీ కురప్పల్లె గ్రామానికి చెందిన జి. నారాయణస్వామి (55) ప్రైవేట్ బస్సు ఢీకొని మృతి చెందాడు. కర్ణాటక పోలీసుల కథనం మేరకు మండలానికి చెందిన నారాయణ స్వామి పని నిమిత్తం కర్ణాటక రాష్ట్రం కోలారు జిల్లా శ్రీనివాసపురం తాలూకా లక్ష్మీపురం వెళ్లాడు. అక్కడ మదనపల్లి నుంచి బెంగళూరు వెళుతున్న ప్రైవేట్ బస్సు ఢీకొని మృతి చెందాడు. కర్ణాటక పోలీసులు కేసు నమోదు చేశారు.

ఎవరీ వృద్ధురాలు.!


వృద్ధురాలిని ఆశ్రమంలో చేర్పించేందుకు ఆటోలో తీసుకెళుతున్న దృశ్యం

కడప అర్బన్ : కడప నగరంలోని మాసాపేటలో ఓబుళమ్మ అనే వృద్ధురాలిని స్థానికులు గుర్తించారు. ఆమెను ఏ ఊరని అడిగితే తనది మాధవరం చిన్నపురెడ్డిపల్లె అని చెబుతోంది. తనను ఆటోలో తీసుకువచ్చి ఇక్కడ వదిలేసి వెళ్లారంటోంది. ఆమెకు సంబంధించిన వారు ఎవరూ రాకపోవడంతో స్థానికులు ఆమెను రిమ్స్ సమీపంలోని పద్మావతి వృద్ధాశ్రమంలో చేర్పించారు. ఆమె బంధువులు ఎవరైనా ఉంటే 95508 74906 నంబరులో సంప్రదించాలని సూచించారు.

గ్రా'నైట్' తరలుతోంది.!

- ఇష్టారాజ్యంగా చెలరేగిపోతున్న గ్రానైట్ మాఫియా
- గుర్రంకొండ మీదుగా వెళుతున్న వైనం
- అక్రమార్కులపై చర్యలు శూన్యం


గతంలో గుర్రంకొండ పోలీసులు సీజ్ చేసిన గ్రానైట్ లారీ

గుర్రంకొండ : మండల కేంద్రమైన గుర్రంకొండ మీదుగా యథేచ్ఛగా గ్రానైట్ అక్రమ రవాణా సాగుతోంది. అక్రమ గ్రానైట్ వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లుతూ అక్రమార్కులకు కాసుల వర్షం కురిపిస్తోంది. అధికారపార్టీ నాయకులు, అధికారుల అండతో గ్రానైట్ మాఫియా ఇష్టారాజ్యంగా చెలరేగిపోతోంది. పట్టించుకోవాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారు.

రాయచోటి, పీలేరు నియోజకవర్గాల్లోని పలు మండలాల్లో గ్రానైట్ క్వారీలు ఎక్కువగా ఉన్నాయి. ఇక్కడి క్వారీలు తీసే గ్రానైట్ రాళ్లను బయట రాష్ట్రాలకు తరలిస్తుంటారు. గుర్రంకొండ అటు తమిళనాడు, ఇటు కర్ణాటక రాష్ట్రాలకు దగ్గరగా ఉండడంతో గ్రానైట్ అక్రమ రవాణా ఈ మార్గం గుండా జోరుగా సాగుతోంది. ఇక్కడి నుంచి సమీప రాష్ట్రాలకు, అక్కడి నుంచి విదేశాలకు గ్రానైట్ అడ్డదారిలో తరలిపోతోంది. అక్రమార్కులు ఏకంగా నకిలీ పర్మిట్లు, సీ-ఫాంలు, వే బిల్లులను వారే సొంతంగా కంప్యూటర్ల ద్వారా తయారు చేసుకొని సరిహద్దులు దాటించేస్తున్నారు. రెండు నియోజకవర్గాల నుంచి ప్రతిరోజు ఐదు లారీల గ్రానైట్ అక్రమంగా తరలిపోతోంది. గతంలో గుర్రంకొండ పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు గ్రానైట్ లారీలను సీజ్ చేసిన సంఘటనలు చోటుచేసుకొన్నాయి. ఇటీవల కర్ణాటక సరిహద్దులో ఈ ప్రాంతానికి చెందిన నాలుగు గ్రానైట్ లారీలను రికార్డులు సరిగ్గా లేవంటూ అక్కడి పోలీసులు సీజ్ చేసి కేసులు నమోదు చేశారు.

రాత్రిళ్లు అక్రమ రవాణా

గ్రానైట్ అక్రమ రవాణా రాత్రిళ్లు జోరుగా సాగుతోంది. పగటి పూట కంటే రాత్రిళ్లు గ్రానైట్ లారీల రవాణాకు అనుకూలంగా ఉంటుందని అక్రమార్కులు ఈ పద్ధతిని ఎంచుకొన్నారు. పగటి పూట పోలీస్ గస్తీలతోపాటు పలు శాఖల అధికారుల తనిఖీలు ఎక్కువగా ఉంటాయి. దీంతో చేసేదిలేక రాత్రిళ్లు గ్రానైట్ రవాణా చేయడాన్ని ప్రత్యామ్నాయ మార్గంగా భావించి తమ కార్యకలాపాలు యథేచ్ఛగా సాగిస్తున్నారు. దీంతో ప్రతిరోజు గుర్రంకొండ మీదుగా నాలుగు నుంచి ఐదు గ్రానైట్ లారీలు తరలిపోతుండడం గమనార్హం.

పోలీస్ స్టేషన్ల వద్ద రైట్‌రైట్

రాయచోటి నుంచి కర్ణాటక సరిహద్దులు దాటే వరకు ఉన్న అన్ని పోలీస్ స్టేషన్ల వద్ద గ్రానైట్ లారీలకు అందరూ రైట్ రైట్ చెబుతున్నట్లు సమాచారం. ఏ ఒక్క పోలీస్ స్టేషన్ వద్ద కూడా ఈ లారీలను ఆపి రికార్డులు తనిఖీ చేసిన దాఖలాలు లేవు. ఒకవేళ ఆపినా పాత రికార్డులు, వేబిల్లులు చూపించి యథేచ్ఛగా అక్రమ రవాణా సాగిస్తుండడం గమనార్హం. ఒక వేళ పోలీసుల తనిఖీలు ఉన్నా చూసీ చూడనట్లు విడిచి పెడుతున్నారనే విమర్శలున్నాయి.

అధికారుల చర్యలు ఏవీ..!

ప్రతిరోజు గ్రానైట్ అక్రమంగా తరలిపోతున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. గుర్రంకొండ అక్రమ రవాణాకు ప్రధాన మార్గంగా నిలిచింది. పోలీస్ స్టేషన్లు, చెక్‌పోస్టుల్లో అక్రమార్కులు మామూళ్లు సమర్పించుకుంటూ వెళుతుండడంతో అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. దీనికి తోడు గ్రానైట్ యజమానులు సంబంధిత అధికారులను ప్రసన్నం చేసుకొని నెలవారి మామూళ్లు ముట్టచెబుతుండడంతో వీరి అక్రమ రవాణాకు అడ్డులేకుండా పోతోంది. పగటిపూట వెళితే అనుమానం వస్తుందనే ఉద్దేశంతో కేవలం రాత్రిళ్లు గుట్టుచప్పుడు కాకుండా తరలించేస్తున్నారు. దీంతో లక్షలాది రూపాయలు ప్రభుత్వ ఆదాయనికి గండిపడుతోంది. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.


గుర్రంకొండ మీదుగా యథేచ్ఛగా తరలిపోతున్న గ్రానైట్ లారీలు

చర్యలు తీసుకుంటాం



గుర్రంకొండ మీదుగా బయట ప్రాంతాలకు వెళ్లే అక్రమ గ్రానైట్ లారీపై చర్యలు తీసుకుంటాం. ప్రతి రోజు తనిఖీలు ముమ్మరంగా చేసి రికార్డులు సరిగ్గా ఉంటేనే అనుమతి ఇస్తాం. రికార్డులు సరిగ్గాలేని వాహనాలను సీజ్ చేసి సంబంధిత శాఖ అధికారులకు అప్పగిస్తాం.

– మధురామచంద్రుడు, ఎస్ఐ, గుర్రంకొండ

మహిళ ఆత్మహత్య

జమ్మలమడుగు రూరల్ : జమ్మలమడుగు పట్టణంలోని నాగలకట్ట కాలనీలో నివాసం ఉంటున్న లక్ష్మీ ప్రసన్న (32) అనే వివాహిత ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. పట్టణ సీఐ ఎస్.లింగప్ప కథనం మేరకు.. లక్ష్మీ ప్రసన్న తన హరి కిరణ్ శర్మతో కలిసి గత కొంత కాలం నుంచి నాగలకట్ట కాలనీలో కాపురం ఉంటున్నారు. ఆమె భర్త కాలనీలో ఉన్న శ్రీ చౌడేశ్వరి ఆలయంలో పూజారిగా ఉన్నాడు. వీరి మధ్య తరచూ కలహాలు జరిగేవి. దీంతో జీవితంపై విరక్తి చెంది శనివారం అర్ధరాత్రి ఆమె ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఇంటికి వచ్చి గమనించిన భర్త పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

మస్కట్‌లో కడప వాసి మృతి

కడప అర్బన్ : కడప నగరంలోని బిస్మిల్లా నగర్‌కు చెందిన షేక్ మహమ్మద్ అనీష్ అన్సారీ (35) అనే వ్యక్తి మస్కట్‌లో మృతి చెందాడు. జీవనోపాధికోసం వెళ్లిన అన్సారీ గుండెపోటుతో మృతి చెందాడు. మృతదేహాన్ని మస్కట్ నుంచి స్వదేశానికి రప్పించాలని మంత్రి లోకేష్‌కు ఎస్ఎంఎస్ ద్వారా స్థానికులు సమాచారం ఇచ్చారు. ఈమేరకు లోకేష్ స్పందించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, అన్సారీ మృతదేహాన్ని స్వదేశానికి రప్పించేందుకు కృషి చేస్తానని తెలియజేసినట్లు సమాచారం.

టీడీపీ నాయకుల దౌర్జన్యంపై పోలీసులకు ఫిర్యాదు


తాలూకా పోలీస్ స్టేషన్ ఎదుట ఆవేదన వ్యక్తం చేస్తున్న బాధితులు

మదనపల్లె : సీటీఎం పంచాయతీ దళితవాడ జగనన్న కాలనీలో నిర్మించుకున్న ఇంటి పునాదులను, టీడీపీ నాయకులు దౌర్జన్యంగా జేసీబీతో కూల్చివేయడంపై బాధితులు ఆదివారం తాలూకా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బాధితులు బి.శంకరమ్మ, చాగలేటి చంద్రకళ మాట్లాడుతూ.. ఎస్సీ, బీసీ కులాలకు చెందిన తమకు రెండేళ్ల క్రితం సీటీఎం పంచాయతీ జగనన్న కాలనీ సర్వే నంబర్ 354/2లో ఇంటిస్థలం పట్టా మంజూరైందన్నారు. ప్రభుత్వ అధికారులు చూపిన స్థలంలో పునాదులు నిర్మించుకున్నామన్నారు. వాటికి సంబంధించి హౌసింగ్ అధికారులు తమ బ్యాంకు ఖాతాకు రూ.70వేల మొత్తాన్ని చెల్లించారన్నారు. ఇదిలాఉండగా, సీటీఎం గొల్లపల్లెమిట్టకు చెందిన పగడాల నాగేంద్ర, గౌర కృష్ణమూర్తి, గౌర రఘు, గౌర లలిత, గౌర రెడ్డినీల, మచ్చ శివ తదితరులు శనివారం సాయంత్రం జేసీబీని తీసుకువచ్చి అగ్రకులస్థులమైన తమ ఇళ్ల మధ్యలో మీరు ఇల్లు నిర్మించుకుంటే చూస్తూ ఊరుకోమని బెదిరిస్తూ పునాదులు కూల్చివేశారన్నారు. ప్రభుత్వ అధికారులు తమకు కేటాయించిన స్థలంలోనే పునాదులు నిర్మించుకున్నామని, తమ కష్టార్జితాన్ని నేలపాలు చేయవద్దని ప్రాధేయపడినా పట్టించుకోకపోగా, దౌర్జన్యం చేస్తూ బెదిరింపులకు పాల్పడ్డారన్నారు. ప్రభుత్వం తమకు కేటాయించిన ఇళ్ల స్థలాలు తప్ప తమకు వేరే ఆస్తులు లేవని, జిల్లా ఉన్నతాధికారులు, పోలీసులు స్పందించి తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు. తాలూకా సీఐ కళా వెంకటరమణకు ఫిర్యాదును అందజేసి దౌర్జన్యం చేసిన వ్యక్తులపై కేసు నమోదు చేయాల్సిందిగా కోరారు.

ఆటో -కారు ఢీ

వల్లూరు (చెన్నూరు) : చెన్నూరు మండలం స్థానిక గోపవరం క్రాస్ శ్యామలాదేవి గుడి వద్ద ఆదివారం ఉదయం 8 గంటల సమయంలో ఆటో, కారు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో చెన్నూరు మండలం గోపవరానికి చెందిన వెంకటరమణ అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. సీఐ పురుషోత్తం రాజు ప్రమాదానికి కారణమైన కారును పోలీసు స్టేషన్‌కు తరలించారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి


మృతి చెందిన సుబ్బరాయుడు

కొండాపురం : తాడిపత్రి- కడప జాతీయ రహదారిలోని కె. వెంకటాపురం గ్రామ సమీపంలో సాయిబాబా గుడి ఎదురుగా ద్విచక్రవాహనాన్ని కారు ఢీ కొన్న సంఘటనలో వ్యక్తి మృతి చెందాడు. తాళ్ల ప్రొద్దుటూరు ఎస్ఐ హృషికేశ్వరరెడ్డి కథనం మేరకు వివరాలు.. కొండాపురం మండలం చౌటిపల్లె గ్రామానికి చెందిన పోలుగారి సుబ్బరాయుడు (49) ఆదివారం ద్విచక్ర వాహనంపై తాడిపత్రికి వెళుతుండగా మార్గ మధ్యంలో వెంకటాపురం వద్ద కారు అతి వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు ఫినాయిల్ బాటిళ్లు అమ్ముకుంటూ జీవనం సాగించేవాడు. ఇతనికి కుమారుడు, కూతురు, భార్య ఉన్నట్లు ఎస్ఐ తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేశామన్నారు.

కారు బోల్తా.. తప్పిన ప్రమాదం


కారు బోల్తాపడిన దృశ్యం

వీరబల్లి : మండలంలో సోమవరం పంచాయతీలో పుత్తావాండ్లపల్లి వైపు నుంచి రాగిమానిదిన్నెపల్లె మార్గమధ్యంలో వంటిల్లు ఆంజనేయస్వామి గుడి క్రాస్ వద్ద కారు అదుపు తప్పి బోల్తా పడింది. అయితే ఇందులో ప్రయాణిస్తున్న ఏడుగురిలో ఎవరికీ గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. వివరాలిలా.. రాగిమానిదిన్నెపల్లికి చెందిన సంఘంవాళ్లపల్లి పంచాయతీ సర్పంచ్ సిబ్యాల రామాంజనేయులు తన కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం రాత్రి 8 గంటల సమయంలో ఇంటికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. విషయం తెలుసుకున్న బంధువులు, స్నేహితులు సంఘటనా స్థలానికి చేరుకొని సర్పంచ్, ఆయన కుటుంబ సభ్యులను కారునుంచి బయటకు తీసి క్షేమంగా ఇంటికి చేర్చారు.

ఎవరేమనుకున్నా..తగ్గేదేలే!

- కాలు దువ్విన పందెం కోళ్లు
- ముదివేడు దగ్గర జాతరలా కోడి పందెం


ముదివేడు సమీపంలో వందలాది మందితో జోరుగా సాగిన కోడి పందెం

సాక్షి టాస్క్‌ఫోర్స్: సంక్రాంతి పండగను పురస్కరించుకుని అన్నమయ్య జిల్లా కురబలకోట మండలంలో గోదావరి జిల్లాలను తలపింపజేసేలా కోడిపందేలను జోరుగా నిర్వహించారు. ముదివేడు గ్రామం గొల్లపల్లె సమీపంలో ఆదివారం ఉదయం నుంచి రాత్రి పొద్దుపోయే దాకా కాయ్ రాజా కాయ్ అన్నట్లుగా జోరుగా కోడిపందెం సాగింది. అన్నమయ్య జిల్లాలో ఇంత పెద్ద ఎత్తున పందెం జరగడం ఇక్కడేనని భావిస్తున్నారు. ఇంత జరుగుతున్నా కనీసం పట్టించుకున్న పోలీసులు లేరంటే ఆశ్చర్యాన్ని కల్గిస్తోంది. విచిత్రమేమంటే ముదివేడు పోలీస్ స్టేషన్‌కు కూత వేటు దూరంలో ఈ కోడి పందెం జరగడం మరో విశేషం. పెద్ద సంఖ్యలో జనం హాజరై కోడి పందేలను ఎంజాయ్ చేశారు. కోడి పందెం పెద్ద ఎత్తున సాగడంతో బెట్టింగులు కూడా లక్షల్లో సాగినట్లు చెబుతున్నారు. పరోక్షంగా పోలీసుల అనుమతి కూడా ఉందని గ్రహించిన జనం చూసేందుకు పరిసర ప్రాంతాల వారే కాకుండా దూర ప్రాంతాల వారు కూడా వచ్చారు. బెట్టింగులతో కొందరు లాభ పడ్డారు. పలువురు జేబులు గుల్ల చేసుకున్నారు. ఇంత బరితెగింపుగా ఎన్నడూ కోడి పందేలు జరగలేదని పలువురు చెబుతున్నారు. ముఖ్యంగా అధికార పార్టీ నాయకులకు పోలీసులు తొత్తుగా మారడంతో ఇలా యథేచ్ఛగా కోడి పందేలు జరిగినట్లు భావిస్తున్నారు. అధికార పార్టీకి కొమ్ము కాస్తూ ఏకపక్షంగా వ్యవహరిస్తున్న ముదివేడు ఎస్ఐ దిలీప్‌కుమార్‌పై తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. లేదంటే కోర్టును ఆశ్రయించాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారు.

అక్రమ ఇసుక రవాణాకు అడ్డుకట్ట ఏదీ.!


కడపకు ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్

సిద్దవటం : మండలంలోని డేగనవాండ్లపల్లె, మాచుపల్లె, టక్కోలు గ్రామాల సమీపంలోని పెన్నానది నుంచి ఇసుక అక్రమ రవాణా చేస్తున్నా అధికారులు అడ్డుకట్ట వేయడంలో విఫలమయ్యారని పలువురు విమర్శిస్తున్నారు. ప్రతి రోజు ట్రాక్టర్ల ద్వారా ఇసుకను అక్రమంగా కడపకు తరలిస్తున్నారని, ఈ విషయమై పలుమార్లు అధికారులకు విన్నవించుకున్నా ఫలితం లేకుండా పోయిందని స్థానిక ప్రజలు వాపోతున్నారు. ఆదివారం కూడా పెన్నానది నుంచి ఇసుక తరలిపోయిందన్నారు. ఈ విషయమై ఒంటిమిట్ట సీఐ బాబును వివరణ కోరగా ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు గత కొన్ని రోజులుగా దాడులు జరుపుతున్నామన్నారు. ఇసుక రవాణా జరగకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

బీమాతో ధీమా.!

- తక్కువ బోనస్
- పాలసీలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న తపాలాశాఖ అధికారులు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ప్రైవేట్ పాలసీలు ఎన్ని వస్తున్నా తపాలా పాలసీలపై ప్రజలకు నమ్మకం ఎక్కువ. తక్కువ చెల్లింపులతో ఎక్కువ బోనస్ ఇస్తారనే విశ్వాసం ఉంది. తపాలా శాఖలో పలు పాలసీలు ఉన్నా ప్రజల్లో అవగాహన ఆశించిన స్థాయిలో లేదు. జీవిత బీమా పథకం ప్రజల జీవితాలకు ఆర్థిక భరోసా ఇచ్చేలా దోహదపడుతోంది. 1884 ఫిబ్రవరి 1న కేవలం తపాలా శాఖలో ఉద్యోగం చేసే వారి కోసం ప్రారంభమైన పీఎల్ఐ(పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్) కాలక్రమేణా అందరికీ అందుబాటులోకి తెచ్చారు.

తపాలా బీమా పాలసీలను 18 నుంచి 55 సంవత్సరాల లోపు వయస్సు గలవారు తీసుకోవచ్చు. రూ. 50 లక్షల వరకు తీసుకునే సౌకర్యం ఉంది. పాలసీలు 3 నెలలు, 6 నెలలు, సంవత్సరానికి ఒకసారి చెల్లించే సౌలభ్యం ఉంది. ప్రధానంగా ఆరు రకాల పాలసీలు అమలవుతున్నాయి. వాటిలో సంతోష్, సువిధ, సుమంగళి, యుగళ్ సురక్ష, సురక్ష బాలాజీ పాలసీలు ఉన్నాయి. వీటిపై ప్రజల్లో చాలామందికి అవగాహన లేదు. దీనిపై తపాల శాఖ అధికారులు సభలు, సమావేశాలు నిర్వహించి మరింత అవగాహన కల్పిస్తే ప్రయోజనకరంగా ఉంటుంది.

పాలసీ వివరాలు..

సంతోష్ : తపాలా శాఖ ద్వారా తీసుకున్న పాలసీల్లో అధిక శాతం మంది మొగ్గు చూపుతున్న ఎండోమెంట్ పాలసీ ఇది. క్రమంగా ప్రీమియం చెల్లించిన మూడు సంవత్సరాల తర్వాత రుణం తీసుకునే సదుపాయం ఉంది. మొత్తం టాక్స్ సేవింగ్ బెనిఫిట్ పొందవచ్చు. పాలసీ ఆమోదించిన నాటి నుంచి పూర్తి జీవిత రక్షణ ఉంటుంది.

సువిధ : హోల్‌లైఫ్ పాలసీదారులు 5 సంవత్సరాలు పూర్తి అయిన తర్వాత సంతోష్ పాలసీలోకి మారే వెసులుబాటు కల్పించారు. తక్కువ డబ్బులు చెల్లించే వీలుతో పాటు రుణం తీసుకునే సౌకర్యం ఉంది.

సుమంగళి : మనీ బ్యాక్ పాలసీగా తపాలా శాఖ అందిస్తోంది. 15, 20 సంవత్సరాల వ్యవధిలో పాలసీని పొందవచ్చు. 15 సంవత్సరాల పాలసీలో వరుసగా 6 సంవత్సరాలు పూర్తి కాగానే కట్టిన మొత్తం నుంచి 20 శాతం, 9 సంవత్సరాల తర్వాత మరో 20 శాతం, 12 సంవత్సరాల తర్వాత మరో 20 శాతం, చివరగా 15 సంవత్సరాల తర్వాత 40 శాతం నగదుతో పాటు అదనపు బోనస్ పొందవచ్చు. దీంతో పాటు 20 సంవత్సరాల పాలసీలు 8, 12, 16, 20 సంవత్సరాలలో బోనస్ లభిస్తుంది. ప్రధానంగా మధ్య తరగతి ఉద్యోగులకు ప్రయోజనకరం.

యుగల్ సురక్ష : ఇది జాయింట్ (భార్యా భర్తలకు) పాలసీ. ఇందులో ఒకరు ప్రీమియం చెల్లిస్తే సరిపోతుంది. రిస్క్ కవరేజ్ మాత్రం దంపతులు ఇద్దరికీ వర్తిస్తుంది. ఈ పాలసీకి సంతోష్ పాలసీ నిబంధనలు వర్తిస్తాయి. ఈ పాలసీ కింద నాన్ మెడికల్ పాలసీ గరిష్టంగా రూ.5 లక్షలకు మాత్రమే తీసుకోవచ్చు.

సురక్ష : ఇది కూడా హోల్ లైఫ్ పాలసీ. 19 నుంచి 58 సంవత్సరాలు గలవారు పాలసీకి అర్హులు. రూ. 20 వేల నుంచి రూ. 50 లక్షల వరకు పాలసీ తీసుకోవచ్చు. 4 సంవత్సరాలు చెల్లించిన తర్వాత రుణం తీసుకునే సౌలభ్యం ఉంది. మెచ్యూరిటీ మొత్తాన్ని 80 సంవత్సరాల తర్వాత పాలసీదారుడికి గానీ వారి నామినీకి గాని చెల్లిస్తారు. ప్రతి లక్ష రూపాయలకు రూ. 7600 బోనస్ పొందవచ్చు.

చిల్డ్రన్స్ పాలసీ : 5 నుంచి 20 సంవత్సరాల బాలబాలికలకు ఈ పాలసీని తపాలా శాఖ అందిస్తోంది. ప్రధానంగా పీఎల్ఐ పాలసీని పిల్లల తల్లిదండ్రులు నమోదు అయి ఉంటేనే ఈ చిల్డ్రన్స్ పాలసీ వర్తిస్తుంది. ఇందులో రూ.20 వేల నుంచి రూ. 30 లక్షల వరకు పాలసీ తీసుకునే సౌకర్యం కలదు.

పాలసీలు ఉపయోగకరం



తపాలాశాఖ ద్వారా అందే బీమా పాలసీలు ఎంతో ఉపయోగకరం. ఇతర బీమా సంస్థల నుంచి వచ్చే రాబడి కంటే మెరుగైన ఆదాయం వస్తుంది. అన్ని రకాల ఉద్యోగులు పీఎల్ఐ పాలసీలను అన్ని తపాలా కార్యాలయాల్లో పొందవచ్చు.పాలసీలు తీసుకుంటే కుటుంబానికి భరోసా ఉంటుంది.

– రాజేష్, తపాలాశాఖ సూపరింటెండెంట్, కడప డివిజన్

ప్రజలు, ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలి



పీఎల్ఐ పాలసీని ప్రజలు, ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలి. ఈ పాలసీపై గ్రామాల్లో, నగరంలో విస్తృతంగా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ఈ పాలసీ తీసుకుంటే కుటుంబానికి జీవన రక్షగా ఉంటుంది.

-మునాఫ్, పీఎల్ఐ డెవలప్‌మెంట్ మేనేజర్, కడప డివిజన్

పిచ్చి కుక్క వీరంగం

- 20 మందిపై దాడి
- పలువురి పరిస్థితి విషమం


పిచ్చికుక్క దాడిలో తీవ్రంగా గాయపడిన బాధితులు

ములకలచెరువు : ఒక పిచ్చి కుక్క వీరంగం సృష్టించి సుమారుగా 20 మందిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన సంఘటన ఆదివారం మండలంలో కలకలం రేపింది. దీంతో స్థానిక ప్రజలు భయాందోళనతో హడలెత్తిపోయారు. స్థానికులు, వైద్య సిబ్బంది కథనం మేరకు వివరాలు... మండలంలోని చౌడసముద్రం, దేవులచెరువు, అడివిచెరువు, అడివినాయనచెరువుపల్లి, గట్టుకిందపల్లె గ్రామాల్లో ఒక పిచ్చి కుక్క వృద్ధులు, యువకులపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. ఈ విషయం తెలుసుకున్న ప్రజలు ఇళ్లలో నుంచి వచ్చేందుకు సాహసించలేదు. ఇళ్ల తలుపులు మూసుకొని ఇళ్లలోనే ఉండిపోయారు. పిచ్చికుక్క మాత్రం స్వైర విహారం చేస్తూ ఎదురుపడిన వారిపై దాడికి పాల్పడింది. ములకలచెరువు పీహెచ్‌సీలో ఏ.మంజుల(35), ఎస్.లోకేష్(32), కె.చంద్రారెడ్డి(55), డి.వెంకటలక్ష్మమ్మ(46), జి.వెంకటప్ప(55), బి.గంగాద్రి(32), ఎస్.అంజన్న(30), జి.శ్రీనివాసులు(43), ఎస్.మహ్మద్(25) తదితరులు చికిత్స పొందారు. వీరిలో పలువురి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. మిగిలిన వారు మదనపల్లె ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లి చికిత్స పొందుతున్నారు.

ముంచిన కలుపు నివారణ మందు


దెబ్బతిన్న నువ్వుల పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి


రైతు తన పంటకు వాడిన మందు

- నువ్వుల పంటకు తీవ్ర నష్టం
- నష్టపరిహారం ఇవ్వకపోతే ఆత్మహత్యే శరణ్యమంటున్న రైతు

సింహాద్రిపురం : కలుపు మందుతో ఏకంగా రైతు తన పంటనే కోల్పోయిన సంఘటన వైఎస్ఆర్ జిల్లా రావులకొలను గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన మహేష్‌రెడ్డికి నాలుగు ఎకరాల సొంత పొలం ఉంది. అదే గ్రామానికి చెందిన రామ్మోహన్‌రెడ్డికి చెందిన 15 ఎకరాలను కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాడు.

ఖరీఫ్ సీజన్‌లో పంట చేతికి అందక పోవడంతో రబీపై ఆశలు పెట్టుకుని గత ఏడాది డిసెంబర్ 9న పులివెందులలోని గురుబాలాజీ ఫర్టిలైజర్ షాపులో నల్ల నువ్వులు కొనుగోలు చేశాడు. కౌలుకు తీసుకున్న 15 ఎకరాల్లో డిసెంబర్ 11న నువ్వుల పంటను సాగు చేశాడు. అయితే అదే ఫర్టిలైజర్ షాపు వారి సలహా మేరకు కలుపు నివారణ మందు కొని డిసెంబర్ 12న పంటకు పిచికారీ చేశాడు. మందు చల్లినా పంట ఎదుగుదల లేకపోవడంతో నీటి తడులు అందించాడు. అయితే మందు చల్లిన పంట పూర్తిగా దెబ్బతినింది. మందు తక్కువ రావడంతో 20 సెంట్ల నువ్వుల పంటకు పిచికారీ చేయలేదు. ఆ పంట మాత్రం బాగానే ఉందని రైతు అంటున్నాడు. కలుపు నివారణ మందు పిచికారీ చేసిన పంట మాత్రమే పూర్తిగా దెబ్బతినిందని రైతు వాపోతున్నాడు. 15 ఎకరాల్లో పంట సాగుకు, మందులకు సుమారు రూ.3 లక్షల ఖర్చు చేశామని రైతు అంటున్నాడు. నష్టపోయిన పంటకు పరిహారం ఇవ్వకపోతే ఆత్మహత్యే శరణ్యమని రైతు వాపోతున్నాడు. తమకు న్యాయం చేయాలని కలెక్టర్‌ను కలిసి విన్నవించనున్నట్లు ఆయన తెలిపారు. కాగా మండల వ్యవసాయ అధికారి శివమోహన్ నువ్వుల పంటను పరిశీలించారు. ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామన్నారు.